క్లుప్తంగా

ఆడపిల్లల భద్రత కోసమే చట్టాలు

దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల భద్రత కోసమే చట్టాలు తీసుకొచ్చి సంరక్షించేందుకు పలు చర్యలు చేపట్టిందని సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఐసీడీఎస్ సీడీపీఓ శారద తెలిపారు. దొరవారిసత్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం బేటీ బచావ్ బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. బాల్యవివాహ చట్టాలు, లింగనిర్ధారణ, గర్భస్రావాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి చైతన్య, హెల్త్ ఎడ్యుకేటర్ సుభాషిణి, సూపర్‌వైజర్స్ సంపూర్ణ, పద్మావతి పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పించండి



విలేకరులతో మాట్లాడుతున్న హిజ్రాలు

గూడూరు: పోలీసులు మాకు రక్షణ కల్పించాలంటూ పలువురు హిజ్రాలతో కలిసి, గూడూరు హిజ్రాల సంఘం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం పట్టణానికి చెందిన పలువురు హిజ్రాలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పండూ నాయక్, శ్యామలానాయక్, రజనీ నాయక్ తమను మీరు రాయలసీమ వారితో కలవకూడదంటూ బెదిరిస్తున్నారన్నారు. వారి నుంచి రక్షణ కల్పించాలంటూ దేవీనాయర్, లతానాయర్, సిమ్రాన్, శేషు, శ్రీదేవి, సుధ, కీర్తి, ప్రభ, హర్షిత పుష్ప కోరారు.

టీకా తప్పనిసరిగా వేయించాలి

గూడూరు: రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని గూడూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమం గురువారం పట్టణంలోనూ, రూరల్, బాలాయపల్లి మండలాల్లో జరిగింది. ఆయన మాట్లాడుతూ పశువుల్లో ప్రస్తుతం ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటోందన్నారు. రైతులు నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ టీకా వేయించాలన్నారు.

లక్ష్మీనరసింహుని సేవలో నేదురుమల్లి

వెంకటగిరిరూరల్ (బాలాయపల్లి): మండలంలోని కనుమరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా నేదురుమల్లికి పూర్ణకుంభస్వాగతం పలికి సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి ఉన్నారు.

ఉన్నత పాఠశాల తనిఖీ



పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఉప విద్యాశాఖాధికారి

గూడూరురూరల్: మండలంలోని విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం మధ్యాహ్నం గూడూరు డిప్యూటీ విద్యాశాఖాధికారి యూ.శివప్రకాష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి పబ్లిక్ పరీక్షలపై సూచనలు ఇచ్చారు. అనంతరం పాఠశాల పూర్వవిద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన పరీక్ష సామగ్రిని డిప్యూటీ విద్యాశాఖాధికారి పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం డి.జయరామానాయుడు, పూర్వ విద్యార్థులు హరి, సునీల్, మహేందర,. షాషీర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఓజిలి: మండల కేంద్రంలోని రెవెన్యూ, ఎంఈఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి పటిష్ట బందోస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సీఐ సోమయ్య, ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి ఉన్నారు.

భారీ వాహనంతో ట్రాఫిక్‌కు అంతరాయం

చిల్లకూరు: జాతీయ రహదారిపై ఓ భారీ వాహనం గురువారం వెళుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెన్నై నుంచి క్రిష్ణపట్నం పోర్టుకు ఓ భారీ వాహనం వెళుతుండడంతో బూదనం టోల్ ప్లాజా వద్ద నెల్లూరు వైపు మార్గంలో కాకుండా చెన్నై మార్గంలోకి భారీ వాహనాన్ని మళ్లించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. భారీ వాహనానికి అడ్డంగా ఉండే విద్యుత్‌తీగలు తొలగించుకుంటూ రావడంతో వాహనాలు ఆగిపోయాయి. గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు భారీ వాహనాన్ని నెల్లూరు మార్గంలోకి మళ్లించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించారు.

కల్వర్టు నిర్మాణంపై పరిశీలన

పెళ్లకూరు: చిల్లకూరు గ్రామం వద్ద అరుంధతి కాలనీ సమీపంలో కల్వర్టు నిర్మాణంపై గురువారం నీటిపారుదల శాఖ డీఈ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కందమూడి శివకుమార్, పగడాల హరిబాబురెడ్డి, ఏఈ ప్రకాష్ ఉన్నారు.

విజయమే లక్ష్యంగా కృషిచేద్దాం

- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



కార్తీక్ రెడ్డిని అభినందిస్తున్న నేదురుమల్లి



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమష్టిగా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు కృషిచేయాలని తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి ఆత్మీయ సమావేశంలో నేదురుమల్లి పాల్గొని ప్రసంగించారు. ముందుగా వెందోటి కార్తీక్ రెడ్డి నివాసం నుంచి సభా ప్రాంతం వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో నేదురుమల్లి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని 7 నియోజకవర్గాలో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించేందుకు ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలన్నారు. గతంలో వెంకటగిరి అభివృద్ధి అంటే నేదురుమల్లి కుటుంబంతోనే జరిగిందన్నారు. నియోజకవర్గంలో త్వరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌లను విజయానికి కృషిచేయాలన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళి అన్నారు. ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, ప్రచారవిభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, పార్వతి, గోపికృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్ బాబి, చెలికం చిరంజీవిరెడ్డి, ఢిల్లీబాబు, తోట గణేష్‌రెడ్డి, పేచీరాజ్ పాల్గొన్నారు.

సమష్టిగా జాతరను విజయవంతం చేయాలి

–గూడూరు ఆర్డీఓ. కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 14 నుంచి 17 వరకు జరిగే జాతరను అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. తూర్పుకనుపూరులో గురువారం జాతరపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూర్పుకనుపూరులో ప్రతి ఏడాది ఉగాదికి ముందుగా నిర్వహించే జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారన్నారు. అయితే ఈ ఏడాది పాలకమండలి లేకపోవడం, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఉత్సవ కమిటీని కూడా నియమించకపోవడంతో జాతర నిర్వహణ మొత్తం అధికారులదేనని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మన ఇంట్లో పండుగలా భావించి సమష్టిగా విజయవంతం చేయాలని అన్నారు. తహసీల్దార్ స్వర్ణ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వినతి



గూడూరు పట్టణ చిరకాల కోరిక ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించేలా చూడాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డిని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు కోరారు. విజయవాడలోని చీఫ్ సెక్రటరీ క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిసి, పలు విషయాలపై ఆయనతో చర్చించి, వినతి పత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. –గూడూరు

పేర్నాటికి మద్దతుగా ప్రచారం



కోట: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా గురువారం కోటలో పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, కో-ఆప్షన్ సభ్యుడు మొయిన్, రవి, రవినగర్, ఆకుతోటదిబ్బ, శ్యాంసుందరపురంలలో మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



అరుంధతీయవాడలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు: మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అరుంధతీయవాడలో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని పలు నివాసాలను తనిఖీ చేశారు. అదేవిధంగా ధ్రువీకరణ పత్రాలు లేని, పలు వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ అరుంధతీయవాడలో మత్తు పదార్థాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. తనిఖీల్లో సీఐలు హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, దశరథరామారావు, ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత



పెళ్లకూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

పెళ్లకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం పెళ్లకూరులోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక ఎస్‌ఐ కృష్ణారెడ్డిని ఆదేశించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు భద్రతా ఏర్పాట్లు జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సురేష్‌బాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఏఎస్‌ఐ శ్రీనివాసులు ఉన్నారు.

ఓటరు స్లిప్పులు ఖచ్చితంగా చేరాలి

చిల్లకూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఓటరు స్లిప్పులు ఖచ్చితంగా చేరవేయాలని రెవెన్యూ సిబ్బందికి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ గురువారం ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఓటరు జాబితాతో పాటు ఓటరుకు అందించే స్లిప్‌లను పరిశీలించారు. తహసీల్దార్ స్వర్ణ, ఆర్‌ఐ రమ్యస్వాతి పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

సైదాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను వీఆర్వోలకు తహసీల్దార్ విజయలక్ష్మి అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పులను వీఆర్వోలకు ఆమె అందజేశారు. ఆమె వెంట ఆర్‌ఐ నారాయణ, వీఆర్వో హైమావతి పాల్గొన్నారు.

నేడు చాగణంలో ఆత్మీయ సమావేశం

సైదాపురం: స్థానిక చాగణం కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో జరిగే ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ కోరారు. కల్యాణ మండపంలో గురువారం ఏర్పాట్లను నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. నేతలు వి.ప్రభాకర్‌రెడ్డి, ఎన్.రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



పట్టణంలో ప్రచారం చేస్తున్న నాయకులు

నాయుడుపేటటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి విజయం చేకూర్చాలని కోరుతూ గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. అర్బన్ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం రైతు విభాగం అధ్యక్షుడు జలదంకి మదన్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత పాటేటి నాగార్జున, సాధు మోహన్, కాలగంధ సునీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెళ్లకూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని గురువారం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తాళ్వాయిపాడు, కానూరు, పెన్నేపల్లి గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేపట్టారు. తొలి ప్రాధాన్యత ఓటును పేర్నాటికి వేయాలని విన్నవించారు. జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, నేతలు రఘునాయుడు, సురేష్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, వీరకుమార్, అశోక్, చలపతి, గురవయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



సూళ్లూరుపేట పట్టణంలో పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఉపాధ్యాయులు, పట్టభద్రులను కోరుతూ ప్రచారం చేశారు. వారం రోజుల నుంచి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ గురువారం పట్టణంలోని సాయి విద్యానికేతన్, చాంపియన్ స్కూల్, గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలోని ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పార్టీ నేతలు గోగుల తిరుపాల్ పాల్గొన్నారు.